ఘనంగా ప్రతిష్ఠాపన హోమాలు



ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ దంపతులు

మణికొండ: కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన సందర్భంగా నార్సింగిలో బుధవారం హోమాలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు చతుస్థానార్చనతో ప్రారంభమైన పూజలు మూలమంత్ర హోమాలు, మూర్తులకు నవకలశ స్నపనం, సుదర్శన, సామూహిక సుదర్శన, వేంకటేశ్వర హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం 11.40 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠను పూర్తి చేశారు. సాయంత్రం 5 గంటలకు శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం, ఆదివాస హోమం, కళాన్యాస హోమాలు నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. గురువారం ఉదయం 11.42 గంటలకు శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠాపన, సాయంత్రం 6 గంటలకు భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. పూజల్లో నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ దంపతులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలి



మణికొండ: వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతూ సామాజిక సవాళ్లను పరిష్కరించేందుకు కృషి చేయాలని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు సూచించారు. గండిపేటలోని కళాశాలలో 77 మంది ప్రతిభ గల అధ్యాపకులు, విద్యార్థులకు నూతన పరిశోధనల కోసం రూ. 72.68 లక్షల నిధులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలు పరిశోధనల్లో ప్రతిభను చాటిన వారికి భవిష్యత్ పరిశోధనలకు అవసరమయ్యే నిధులను కళాశాల యాజమాన్యం అందించడం గర్వకారణమన్నారు. ఇలాంటి ప్రోత్సాహకాలతో భవిష్యత్ ఆవిష్కరణలు, పురోగతికి పునాది వేసేందుకు దోహదపడుతుందన్నారు. అలాగే కళాశాలలో పరిశోధన దినోత్సవాలు, సాంకేతిక సదస్సులు నిర్వహించగా వాటిల్లో ప్రతిభ చూపిన వారికి నిధులు కేటాయించామని సద్వినియోగం చేసుకొని తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలికి పరామర్శ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటమ్మను పరామర్శిస్తున్న నాయకులు, అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికురాలు ఎం.వెంకటమ్మ బుధవారం ఉదయం 5 గంటలకు హనుమాన్‌నగర్ బస్తీ నుంచి రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొట్టడంతో తల, చేయి ఫ్యాక్చర్ అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎస్‌డబ్ల్యూఎం) ఎం.శ్రీనివాసులు, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు శంకర్, వినయ్, గోపాల్, చంద్రమోహన్‌తో కలిసి శ్రీకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు వెంకటమ్మను పరామర్శించారు. వాహన యజమాని పూర్తి వైద్యం చేయించాలన్నారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నుంచి హిమాయత్ సాగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో వీధి లైట్లు లేకపోవడంతో ప్రమాదం జరిగిందన్నారు. వెంటనే వీధిలైట్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన



ముగ్గులు వేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రిపురం, సులేమాన్‌నగర్, రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో బుధవారం ముగ్గులు వేసి, ర్యాలీ తీసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి యజమానులు వ్యాపారులను కలిసి రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా తమకు అందించాలని విన్నవించారు. ప్రాజెక్టు అధికారి రాధారాణి మాట్లాడుతూ.. ఉన్నతాధికారులతో పాటు ఉప కమిషనర్ రవి కుమార్ సూచనల మేరకు కార్మికులతో కలిసి బస్తీలు, కాలనీలు, వ్యాపార సముదాయాల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఓపెన్ పాయింట్లలో చెత్త వేయకుండా పారిశుద్ధ్య విభాగంలోని మహిళలు అక్కడ రంగు రంగుల ముగ్గులు వేసి చెత్త వేయద్దంటూ ప్రచారాన్ని చేపట్టారన్నారు. అలాగే వ్యాపారులకు డస్ట్ బిన్లను అందించామని.. అందులోనే చెత్తను వేసి అందించాలని కోరినట్లు తెలిపారు.

హిమాయత్‌సాగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత



హిమాయత్‌సాగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం



శివరాంపల్లిలో: అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

బండ్లగూడ: ప్రభుత్వ స్థలాలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని గండిపేట్ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్ సర్వే నంబర్ 37లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయమై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం భారీ బందోబస్తు మధ్య వాటిని కూల్చివేశారు.

శివరాంపల్లిలో..

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని అక్రమ నిర్మాణాలను రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు బుధవారం కూల్చివేశారు. నిబంధనలు పాటించకుండా ఇండ్ల కట్టారని దీంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు ఇంటి నిర్మాణాలను పరిశీలించి ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు బందోబస్తు మధ్య తొలగించారు. అనుమతులు తీసుకున్న యజమానులు అందుకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

నార్సింగిలో పేలిన ట్రాన్స్‌ఫార్మర్



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని పాత గ్రామపంచాయతీ కార్యాలయం పక్కన బుధవారం రాత్రి ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. అధికలోడ్‌తో దానిలో మంటలు లేచి కాలిపోయింది. విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే సరఫరాను నిలిపివేశారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి మరో దానిని ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరణ పనులు చేపట్టారు.

పేరుకే పెద్ద జీపీలు..!



ఘాంసిమియాగూడ పంచాయతీ భవనం

పంచాయతీ	వసూలు శాతం
రామంజాపూర్	76
మల్కారం	77
బహదూర్‌గూడ	78
పెద్దతూప్ర	78
మదన్‌పల్లికొత్తతండా	79
పెద్దషాపూర్	81
నర్కూడ	81
పాల్మాకుల	82
హమీదుల్లానగర్	83
పెద్దతూప్రతండా	85
పెద్దషాపూర్‌తండా	87
పెద్దగోల్కొండ	88
ఘాంసిమియాగూడ	91
కాచారం	92

- ఆస్తిపన్ను వసూళ్లలో వెనుకబాటు
- ముందంజలో చిన్న పంచాయతీలు

శంషాబాద్ రూరల్: ఆస్తి పన్ను వసూళ్లలో చిన్న పంచాయతీలు ముందుండగా.. మేజర్ పంచాయతీలు ఎప్పటిలాగే వెనకబడ్డాయి. మండలంలోని 27 పంచాయతీల్లో గడిచిన ఆర్థిక సంవత్సరానికి మార్చి 31 వరకు మొత్తంగా (89) శాతం రూ.2,63,50,000 వసూళ్లయ్యాయి. ఇందులో సగం పంచాయతీల్లో వంద శాతం నమోదు కావడం విశేషం. ఇదిలా ఉండగా గత బకాయిలతో పాటు గడిచిన ఆర్థిక సంవత్సరం కలిపి మొత్తం రూ.31,12,000 బకాయిలు ఉన్నాయి.

ఆదాయం కోల్పోతున్న పంచాయతీలు

పంచాయతీల్లో ఆదాయ వనరులు పెంచేందుకు అధికారులు శ్రద్ధ చూపడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. నిర్మాణాలను అసెస్‌మెంట్ చేయడంలో నిర్లక్ష్యం కారణంగా పంచాయతీలు ఆదాయం కోల్పోతున్నాయి. జీఓ 111 సడలింపు ప్రకటన చేసినా.. మార్గదర్శకాలు లేకపోవడంతో అధికారికంగా నిర్మాణాలకు అనుమతులు, అసెస్‌మెంట్ చేయడానికి వీలు కావడం లేదు. ఏటా నిర్మాణాలు పెరుగుతున్నా.. అందుకు అనుగుణంగా ఆస్తి పన్ను వసూలు కావడం లేదు.

కొత్త పంచాయతీల్లో మెరుగైన వసూళ్లు..

ఐదేళ్ల కిందట ఏర్పడిన కొత్త పంచాయతీలు.. తక్కువ ఆదాయ వనరులు కలిగిన పంచాయతీల్లో వంద శాతం ఆస్తి పన్ను వసూళ్లయ్యాయి. ఇందులో చౌదరిగూడ, ఆలీకోల్‌తండా, మదన్‌పల్లిపాతతండా, పిల్లోనిగూడ, రషీద్‌గూడ కొత్త పంచాయతీలు కాగా.. సుల్తాన్‌పల్లి, ముచ్చింతల్, చిన్నగోల్కొండ, జూకల్, కవ్వగూడ, మదన్‌పల్లి, నానాజీపూర్ శంకరాపురం పాత పంచాయతీలు ఉన్నాయి.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకునేలా చూడాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని 300 స్క్వేయిర్ మీటర్ల కంటే ఎక్కువ గల ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఉండాలని లేనివారికి నోటీసులు జారీ చేసి వెంటనే ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. యూఎల్‌బీ లెవల్‌లో ఒక టీం, వార్డు లెవల్‌లో ఐదు టీంలు ఏర్పాటు చేసి ఆదేశాలు జారీ చేశామన్నారు. నూతనంగా ఇండ్ల నిర్మించుకునేవారు ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తేనే అనుమతి మంజూరు చేస్తామన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో వర్షపు నీరు నిల్వ చేసేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు ఇది మంచి ప్రయోగమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, డి.యాదయ్య, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



లేమూరు గ్రామంలో మహవీర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి: మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ బండ్లగూడ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం బుధవారం ముగిసింది. వారం రోజులుగా కందుకూరు మండలంలోని లేమూరు గ్రామంలో కళాశాల ఎస్ఎస్ఎస్ విద్యార్థులు వలంటీర్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

బుధవారం గ్రామంలోని పొలాలను సందర్శించి అక్కడి మట్టిని సేకరించారు. భూసార పరీక్షల కోసం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ల్యాబ్‌కు పంపించారు. ఆ భూముల్లో ఎలాంటి పంటలను వేస్తే అధిక దిగుబడి వస్తుంది అనే విషయాన్ని రైతులకు వివరించారు. మట్టిని సేకరించి పరీక్షలకు పంపించడంతో పాటు, పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్ రెడ్డి, సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా.ఉషాశ్రీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వీరేంద్రపాటిల్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం



పరిశ్రమలో ఎగిసిపడుతున్న మంటలు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ పారిశ్రామికవాడలోని విమల్ మినరల్ రా మెటీరియల్ కంపెనీలో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఫైర్ అధికారి చంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతానికి చెందిన ఓం ప్రకాశ్ ప్లాస్టిక్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. ఉదయం 4 గంటల ప్రాంతంలో కంపెనీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి రా మెటీరియల్‌కు నిప్పు అంటుకున్నది. గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ ఇన్‌స్పెక్టర్ చంద్రనాయక్ ఫైర్ ఇంజిన్‌తో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, స్వల్ప ఆస్తి నష్టం జరిగిందని ఆయన తెలిపారు.

సైకిల్ ట్రాక్‌లోకి దూసుకెళ్లిన కారు

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మైహోం అవతార్ అపార్ట్‌మెంట్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం కారు నార్సింగి నుంచి గచ్చిబౌలికి వెళ్తూ పక్కనే ఉన్న సైకిల్ ట్రాక్‌లోకి దూసుకెళ్లింది. దాంతో సైకిల్ ట్రాక్‌లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లేట్ల పిల్లర్లు ధ్వంసమయ్యాయి. కారులోని వ్యక్తికి గాయాలు కావడంతో 108 సిబ్బంది క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. సైకిల్ ట్రాక్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, కారులోని వ్యక్తి వివరాలు తెలయలేదని పోలీసులు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ బలోపేతం

అత్తాపూర్: రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ పటిష్టంగా ఉందని తెలంగాణ పార్లమెంట్ ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారాగూడెం మల్లారెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో అంచనాలకు మించి సీట్లు సాధించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, నాయకులు బొక్క బాల్‌రెడ్డి, రాజశేఖర్, సుధాకర్, కొమురయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సీతారాముల తలంబ్రాలు

- ఆర్టీసీ కార్గో ద్వారా పంపించేందుకు ఏర్పాట్లు
- ఈనెల 17వ తేదీ వరకు బుక్ చేసుకోవడానికి అవకాశం

రాయదుర్గం: భద్రాచలం సీతారాముల తలంబ్రాలను ప్రజలకు అందించేందుకు ఆర్టీసీ కార్గో ద్వారా ఏర్పాట్లు చేసినట్లు గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆర్టీసీ కార్గో సేవల లాజిస్టిక్ కౌంటర్ల ద్వారా ఇంటింటికి పంపించే ఏర్పాట్లు చేసినట్లు ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ సహకారంతో సీతారాముల తలంబ్రాలు హోమ్ డెలివరీ చేసే కార్యక్రమాన్ని టీఎస్ ఆర్టీసీ శ్రీకారం చుట్టిందని ఆయన వివరించారు. ఈనెల 17వ తేదీ వరకు టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ కౌంటర్లలో రూ.151 చెల్లించి బుకింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు.. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పట్లోళ్ళ విజేందర్‌రెడ్డి 9652267204, 9849567204లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

డయాలసిస్ సెంటర్ పరిశీలన

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ సెంటర్ పనితీరు అద్భుతంగా ఉందని వైద్య విధాన పరిషత్ డిస్టిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ నరేష్ అన్నారు. బుధవారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డయాలసిస్ సెంటర్‌లోని రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా డయాలసిస్ సెంటర్, మార్చి నెల గణాంకాలను ఆయనకు వివరించారు. డయాలసిస్ సెంటర్‌లో మొత్తం హెచ్‌డీ మిషన్లు ఐదు ఉన్నాయని, నాలుగు నెగెటివ్ మిషన్లు , హెచ్‌సీవీ పాజిటివ్ మిషన్ ఒకటి ఉందన్నారు. మార్చి నెలలో 158 మంది పురుషులు, 107 మహిళలకు డయాలసిస్ సేవలు అందించామన్నారు. 232 నెగెటివ్ పేషేంట్లు, 33 మంది పాజిటివ్ పేషేంట్లకు సేవలు అందించామన్నారు. కార్వాన్ నియోజకవర్గం నుంచే కాకుండా పొరుగు నియోజకవర్గాల నుంచి కూడా డయాలసిస్ కోసం తమ వద్దకు వస్తుంటారని ఈ సందర్భంగా మహ్మద్ మజహరుల్లా వివరించారు. డాక్టర్ల పనితీరు, సిబ్బంది చేస్తున్న సేవలతోనే ఆస్పత్రికి గుర్తింపు వస్తుందని అన్నారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా డయాలసిస్ వార్డులో డ్యూటీ డాక్టర్ సేవలను అందుబాటులో ఉంచుతున్నామని అవసరమైన సిబ్బంది కూడా డయాలసిస్ సెంటర్‌కు కేటాయించామన్నారు. మహబూబ్ పాషా, ఎన్‌హెచ్‌ఎ స్టేట్ కో– ఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ ఈవో శ్రీనివాస్, అనుదీప్, డిప్యూటీ ఈఓ చంద్రశేఖర్ ఉన్నారు.

ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలి



కాళీ మందిర్ ప్రాంతంలో ర్యాలీ తీస్తున్న అధికారులు, సిబ్బంది

బండ్లగూడ: ఓటు ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ తెలుసుకొని తప్పకుండా వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ ఆఫీసర్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. పార్లమెంట్ ఎలక్షన్–2024 స్వీప్ కార్యక్రమంలో భాగంగా 'ఐ ఓటు ఫర్ స్యూర్ అనే థీమ్'తో ఉదయం కాళీమందిర్ నుంచి ఉడిపి హోటల్ తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. అధికారులు, సిబ్బంది, ప్రజలు కలిసి భారీ ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఓటు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం కాళీ మందిర్ ఎదుట ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, టీఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెప్మా ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, స్వీపర్లు తదితరులు పాల్గొన్నారు.

బాటసారులకు వృద్ధుల దాతృత్వం



మజ్జిగ పంపిణీ చేస్తున్న స్కైలా గేటెడ్ కమ్యూనిటీ వృద్ధులు

మణికొండ: వేసవిలో బాటసారుల ఇబ్బందులు తీర్చేందుకు వృద్ధులు ముందుకు వచ్చారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్కైలా గేటెడ్ కమ్యూనిటీలోని వృద్ధులు తమవంతుగా బుధవారం గేటెడ్ కమ్యూనిటీ ఎదుట నార్సింగి–మణికొండ రహదారిపై చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి రోజు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధుల సంఘం నాయకుడు గురవరాజు, సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మల్లేశ్

శంషాబాద్ రూరల్: పని కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్కూడకు చెందిన బ్యాగరి మల్లేశ్ (31) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. మార్చి 9న పని కోసం ఉప్పల్ వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. తర్వాత తిరిగి ఇంటికి రాలేదు. దీంతో పలుచోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'దుండగులపై చర్యలు తీసుకోవాలి'

శంషాబాద్ రూరల్: మండలంలోని చౌదరిగూడ రెవెన్యూ పరిధిలో ఫిరంగి నాలాను ధ్వంసం చేయడంతో పాటు కట్టపై ఉన్న చెట్లు తొలగించి చెక్‌డ్యాంను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు ఆర్డీఓకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు కిలో మీటరు దూరం వరకు ఫిరంగి కాలువను ధ్వంసం చేశారన్నారు. భారీ ఎత్తున చేపట్టిన గోదాం అక్రమ నిర్మాణదారులే కాలువను ధ్వంసం చేశారని మండిపడ్డారు. ఈ విషయమై రెవెన్యూ, సాగునీటి శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే స్పందించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

శివాజీ మహారాజ్‌కు ఘన నివాళి



శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నవయువ యూత్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బృందావన్ కాలనీలో ఛత్రపతి శివాజీ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ మహారాజ్ మరాఠ సామ్రాజ్యానికి ఎనలేని సేవలు చేశారని గుర్తు చేశారు. కులాలకు అతీతంగా ప్రజలను పాలించేవారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాబు, రాజు, యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్ రెడ్డి, సభ్యులు సిద్దిరాల జగదీష్, శేఖర్, దొంత తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

'ఈ–పాస్' ద్వారానే ఎరువులు విక్రయించాలి

జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

శంషాబాద్: ఎరువులు, విత్తనాలను ఈ పాస్ యంత్రం ద్వారానే విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి సూచించారు. పట్టణంలోని ఫర్టిలైజర్స్, విత్తనాల షాపులను బుధవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, ఈ పాస్ యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు అవసరమైన ఫర్టిలైజర్స్, అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి కవిత తదితరులు ఉన్నారు.